దశాబ్దాల కల సాకారం

- కోవూరు చెరువు కలుజుపై చప్టా నిర్మాణం పూర్తి
- ఎమ్మెల్యే ప్రసన్న చొరవతో రూ. 2.45 కోట్లతో నిర్మాణం
- ఐదు గ్రామాల ప్రజలకు తీరిన రాకపోకలు కష్టాలు





కోవూరు చెరువు కలుజుపై నూతనంగా నిర్మించిన చప్టా

కోవూరు: మండలంలోని పాటూరు ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. ఎమ్మెల్యే ప్రసన్న చొరవతో పాటూరుకు వెళ్లే మార్గంలోని కోవూరు చెరువు కలుజుపై చప్టా నిర్మాణం పూర్తయింది. దీంతో ఐదు గ్రామాల ప్రజలు ఏటా వర్షాకాలంలో ఎదుర్కొంటున్న రాకపోకల సమస్య తీరింది. మహాకవి తిక్కన నడయాడిన నేల పాటూరు. పట్టు చీరలకు సైతం ఎంతో ప్రసిద్ధి. కోవూరు నుంచి యల్లాయపాళెం మీదుగా దామరమడుగు వెళ్లే మార్గంలో పాటూరు గ్రామం ఉంది. వర్షాకాలంలో కోవూరు చెరువు కలుజు నిండుగా ప్రవహిస్తే ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో గాం. దీజనసంగం, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, యల్లాయపాళెం, దామరమడుగు గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు రైతులు అవస్థలు పడేవారు. మూడేళ్ల క్రితం వచ్చిన పెన్నా వరదలకు కోవూరు చెరువు కలుజు నిండుగా ప్రవహించడంతో పాటూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ సమయంలో గ్రామానికి చెందిన అనారోగ్యం పాలైన వ్యక్తిని వైద్యశాలకు తరలించే అవకాశం లేకపోవడంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించారు. కలుజుపై చప్టా నిర్మించాలని సంబంధిత శాఖల అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినా నిధుల కొరతతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా రూ.2.45 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో యుద్ధప్రాతిపదికన కలుజుపై చప్టా నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దీంతో ఎమ్మెల్యే ప్రసన్నకు ఐదు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



వర్షాకాలంలో కలుజును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న(ఫైల్)

రాకపోకల సమస్య తీరింది



కోవూరు చెరువు కలుజుపై చప్టా లేకపోవడంతో దశాబ్దాలుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో కలుజు నిండుగా ప్రవహించిందంటే ప్రయాణం సాగేది కాదు. చప్టా నిర్మాణంతో దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రాకపోకల సమస్య తీరింది.

–కే దుర్గమ్మ, గుమ్మళ్లదిబ్బ

నరకయాతన తప్పింది



వర్షకాలంలో కలుజు ప్రవహిస్తే కోవూరు నుంచి పాటూరుకు రాకపోకలు నిలిచిపోయేవి. ఏ అవసరం వచ్చిన గ్రామంలోనే ఉండాల్సి వచ్చేది. విద్యార్థులు బడికి వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. కలుజుపై చప్టా నిర్మాణంతో నరకయాతన తప్పింది.

–కేతా మల్లికార్జున్, పాటూరు

సీఎంకు ధన్యవాదాలు



కోవూరు–యల్లాయపాళెం మార్గంలోని కోవూరు చెరువు కలుజు ప్రవహిస్తే ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడేవాళ్లు. ఈ సమస్య ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చప్టా నిర్మాణానికి రూ.2.45 కోట్లు మంజూరు చేశారు. దీంతో యుద్ధప్రాతిపదికన చప్టా నిర్మాణాన్ని పూర్తి చేశాం. చప్టా నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు.

– ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



నెల్లూరు(బృందావనం): విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని నోవా బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఫౌండేషన్ నాల్గో వార్షికోత్సవం, నాగిశెట్టి మురళీకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కల్యాణి చెప్పారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గునుకుల కిషోర్, దగ్గుపాటి రాధాకృష్ణ, కే మల్లికార్జున, పీ కిషోర్, పీ పవన్‌కుమార్, గులాంహుస్సేన్, తదితరులుపాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు ఎనలేనవి



నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు సెంట్రల్ నజారత్‌గా డీ నాగేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని కొనియాడారు. జిల్లా కోర్టు సెంట్రల్ నజారత్ డీ నాగేశ్వరరావు, ఏఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌ల ఉద్యోగ విరమణ సభను జిల్లా కోర్టు ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి యామిని అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇరువురు ఉద్యోగులు న్యాయశాఖలో నిజాయతీగా సేవలు అందించారని, వారిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇరువురి శేష జీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, ప్రధానకార్యదర్శి నారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దీపక్, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి శిబిరంలో శిక్షణ పొందుతున్న 900 మంది క్రీడాకారులకు వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్, కో ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, పాబోలు సత్యనారాయణ సౌజన్యంతో పౌష్టికాహారం అందజేశారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు డీ అనంతరామారావు, జీ వెంకటసురేంద్ర బాబు, సాయిరాం, విజయ్‌రాఘవేంద్ర, డీ రమణయ్యగౌడ్, జీ రఘురామనాయుడు, వీ రామానాయుడు, ఎస్ రఘురామనాయుడు, గోవిందయ్య, ఎస్ రమేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా శివరామకృష్ణ సేవలు భేష్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా వడ్డే శివరామకృష్ణ అందించిన సేవలు భేష్ అని విద్యుత్‌శాఖ నెల్లూరుటౌన్–2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. జనార్దన్‌రెడ్డి కాలనీలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో శివరామకృష్ణ ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఈ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శివరామకృష్ణ శేషజీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం లైన్‌ఇన్‌స్పెక్టర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌నగర్ విద్యుత్ సెక్షన్ ఏఈ విజయ్‌కుమార్, పలువు లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఏఎల్ఎంలు, జేఏల్ఎంలు పాల్గొన్నారు.

న్యూ జర్నలిస్టు కాలనీలో అపరిచితుల అలజడి

నెల్లూరు(క్రైమ్): కొత్తూరులోని న్యూ జర్నలిస్టు కాలనీలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సంచరించడంతో అలజడి రేగింది. స్థానికుల సమాచారంతో వెంటనే స్పందించిన వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ గస్తీని ముమ్మరం చేశారు. గత కొద్దిరోజులుగా న్యూ జర్నలిస్టు కాలనీలో అపరిచితులు సంచరిస్తున్నారు. ప్రత్యేకించి రాత్రి వేళల్లోనే ఇంటింటికి వెళ్లి యాచిస్తున్నారు. వారి వ్యవహారశైలి, వస్త్రధారణ అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ ప్రాంతంలో ఉండగా స్థానికులు ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి పరుగులు తీస్తూ వెళ్లిపోయారు. దీంతో స్థానికులు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని చుట్టపక్కల గాలించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కాలనీపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఆరోగ్య సురక్ష శిబిరం

పొదలకూరు : పట్టణంలోని బిట్–2 సచివాలయంలో వైద్యాఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. నిపుణులైన వైద్యులు రోగులకు బీపీ,షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

గిరిజనుల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: గిరిజనుల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించేందుకు వైద్యాఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించిందని వైద్యాధికారి ఎం రామకృష్ణ తెలిపారు. 'నేషనల్ సికెల్ సెల్ అనిమియా ఎలిమినేషన్ మిషన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మానేగుంటపాడు గిరిజన కాలనీలో శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో ఎక్కువగా రక్తహీనత కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏ వెంకట్రావు, ఎంఎల్‌హెచ్‌పీ మాబ్‌జాన్, ఏఎన్ఎం నదియ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయం



పూజలు నిర్వహించిన నాయకులు

విడవలూరు: వైఎస్సార్‌సీపీ అత్యధిక సీట్లను గెలుచుకుని అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తూ రామతీర్థంలోని కామాక్షీదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్థానిక నాయకులు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 101 కొబ్బరికాయలను కొట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు పొన్నాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ 2024 ఎన్నికలు పేదలు, పెత్తందారుల మధ్యన జరిగాయన్నారు. సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ప్రజలు నిలబడ్డారన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. స్థానిక నాయకులు బుచ్చింగారి తిరపతి, నాటారి చంద్రయ్య, నెల్లూరు చెంచురత్నం, నువ్వూరు నరేష్, అత్తిరాల సుమంత్, నిమ్మల రాజేష్, నిమ్మల భాస్కర్, సుబ్రమణ్యం, సాయి, రాంబాబు, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా పొదలకూరులోని గేటుసెంటరు

పొదలకూరు : మళ్లీ భానుడి భగభగలు మొదలయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతుండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఇటీవల అకాల వర్షం, తుపాన్ ప్రభావంతో కొద్దిగా ఎండలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు సేదతీరారు. రోహిణి కార్తె రాకతో మళ్లీ మూడు రోజులుగా నలభై డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. వేసవి తాపంతో ఉదయం 11 గంటల నుంచి రోడ్లపై జనసంచారం కనిపించడంలేదు. ఎండలకు తోడు పడమటి గాలులు వీస్తుండడంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వెలిగొండలకు దగ్గరగా ఉండడంతో వడగాలుల ఉధృతి అధికంగా ఉంది. వడగాలులకు ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎండ సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచిస్తున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామికి ఊంజల్‌సేవ



విశేషాలంకారంలో ఆంజనేయస్వామి

మనుబోలు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి ఆస్థానోత్సవం, ఊంజల్‌సేవ, పల్లకిసేవలను నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం, నాగవల్లిదళార్చన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పల్లకిసేవకు ఎంవీఎల్ నరసింహాచార్యుల జ్ఞాపకార్థంగా కుమారులు, ఊంజల్ సేవకు గూడూరు పెంచలయ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాంతకం



కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాలెంలో..



పొదలకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొడవలూరు: పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, గుట్కా, పాన్ మసాలా తదితరాల వాడకం ప్రాణాంతకమని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సింధు మేఘన అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని పెమ్మారెడ్డిపాళెం, కొత్తవంగల్లుల్లో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను వాడడం వల్ల నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నిలిపి వేసి ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో పొగాకు ఉత్పత్తుల వాడకానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు సౌమ్య, జాస్మిన్, ఏఎన్ఎంలు శాంతకుమారి, కీర్తి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొదలకూరు : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు ఆధ్వర్యంలో పట్టణంలో పొగాకు ఉత్పత్తులతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ కిరణ్‌రిషిత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

పొదలకూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సేవా సమితి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రతిభాపురస్కారాలను ప్రదానం చేశారు. స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డక్కిలి ఎంఈఓ కే వెంకటేశ్వర్లు, సేవా సమితీ సొసైటీ బాధ్యులు దామోదరరావు, లక్కాకుల ఆనందరావు, సుబ్బానాయుడు, భాస్కర్‌నాయుడు, ఉపాధ్యాయుడు బీ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

పొదలకూరు : పట్టణంలోని పురాతన చరిత్ర కలిగిన వీరఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను శనివారం నుంచి 14 వారాల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. పట్టణంలోని సామాజిక వర్గాల వారీగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. గత ఆరేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలు యథాతథంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆయా కులాల పెద్దలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని చందాలు పోగుచేసి ఉత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మొదటి వారం ఆర్యవైశ్యులు ఉభయకర్తలుగా ఉత్సవాలను నిర్వహించనున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహమ్మద్ రఫీ

వెంకటాచలం: గ్రామాల్లో నెలకొన్న అత్యవసరమైన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎంపీడీఓ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున అత్యవసర సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడైనా ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ మందా కవిత, వైస్‌ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడిన ఏఎన్ఎం



గాయపడిన యేసోబు

కోవూరు: హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడికి ఓ ఏఎన్ఎం చొరవ చూపి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన మండలంలోని గంగవరం పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రామచంద్రాపురం కాలనీకి చెందిన యేసోబు తన ఇంటిపైకి చెత్త తీసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటిపై ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఏఎన్ఎం సర్వేపల్లి శ్యామల వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సీపీఆర్ చేసింది. స్థానిక యువకుల సాయంతో సీపీఆర్ మరోమారు చేయించి స్పృహలోకి తీసుకొచ్చింది. అనంతరం ఆటోలో కోవూరు ప్రభుత్వవైద్యశాలకు పంపించింది. సకాలంలో స్పందించి యువకుడిని ప్రాణాపాయం నుంచి తప్పించిన ఏఎన్ఎంను గ్రామస్తులు అభినందించారు.

నేత్రపర్వం..శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు




కల్యాణాన్ని తిలకిస్తున్న మహిళా భక్తులు



గజ వాహనంపై శ్రీవారు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కల్యాణోత్సవానికి పెండ్యాల రమణయ్యనాయుడు, విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం గజవాహనంపై ఉభయదేవేరులతో కలిసి శ్రీవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గజవాహన సేవకు ఉభయకర్తలుగా జీ అశోక్, సునీత, పీ సుబ్బానాయుడు, పద్మజ దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం హంస వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. హంస వాహన సేవకు జ్యోతి, మాల్యాద్రి, మంజుల ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం శ్రీవారు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయకర్తలుగా కోనం చినబ్రహ్మయ్య, హైమావతి, వాకాటి శ్రీనివాసులురెడ్డి సంధ్య, చొప్పా వెంకటేశ్వర్లు, మంజుల, వరదారెడ్డి, లలితమ్మ, లోకనాథం, సునీత, ప్రసాద్‌నాయుడు, అరుణ, రాంబాబు, శ్రావణి దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాత్రి చెక్కభజన ఏర్పాటు చేశారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు



మనుబోలు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాకుంబాభిషేక మహోత్సవాన్ని జరిపి ఏడాది పూర్తయిన సందర్భంగా అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీరభద్రస్వామికి ఉదయం పంచామృతాభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వీరభద్రస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.